# కిషన్‌రెడ్డి పోటీ నుంచి పారిపోయిండు

- బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించినందుకే పోటీ చేయడం లేదని కిషన్ రెడ్డి వ్యాఖ్యలు
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు హారతులు పడుతున్న మహిళలు

అంబర్‌పేట, నవంబర్ 8 : ఓడిపోతానన్న భయంతోనే కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఎన్నికలలో పోటీ చేయడం లేదని, అస్త్ర సన్యాసం తీసుకున్నాడని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. వాళ్ల పార్టీ బీసీలను ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించి నందునే ఆయన పోటీ చేయడం లేదని చెప్పడం... కిషన్ రెడ్డి బీసీలను కించ పరిచినట్లేనని ధ్వజమెత్తారు. అంబర్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తరపున బాగ్‌అంబర్‌పేట డివిజన్ గజానంద్‌గడ్డ, పాములబస్తీ, పోచమ్మబస్తీ తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ బి.పద్మవెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి గండ్ర మోహన్‌రావులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలను వివరించి కాలేరు వెంకటేశ్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... 2018లో ఓడిపోయి అదృష్టం కలిసొచ్చి కేంద్రమంత్రి అయ్యారని, అయినా ఇప్పటి వరకు సికింద్రాబాద్ పార్లమెంట్‌లో కానీ, అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో కానీ ఎన్ని నిధులు ఖర్చు పెట్టారో చెప్పగలరా? అని ప్రశ్నించారు. రెండు సీట్లు గెలిచే బీజేపీ... బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 130 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ దేశంలో, రాష్ట్రంలో 40 సంవత్సరాల పాటు అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నంతకాలం పదవుల కోసం సొంత పార్టీ నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలకే పరిమితమై అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు మరో అవకాశం ఇవ్వాలంటూ ఏ ముఖం పెట్టుకొని ఓట్ల కోసం వస్తున్నారని ధ్వజమెత్తారు. మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించిన దమ్మున్న నాయకుడు కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీలో అభ్యర్థుల ఎంపిక ఇంకా పూర్తి కాలేదని ఎద్దేవా చేశారు. మళ్లీ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడి హ్యాట్రిక్ సాధించబోతున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముషీరాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

## హైదరాబాద్ అభివృద్ధి బీఆర్‌ఎస్ ఘనతే

**ముషీరాబాద్ ఎన్నికల ప్రచారంలో మంత్రి తలసాని**

ముషీరాబాద్, నవంబర్ 8: హైదరాబాద్‌ను ప్రపంచ మేటి నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పదేండ్లుగా నగరానికి నిరంతరాయంగా మంచినీరు, విద్యుత్ సరఫరా అందించడంతోపాటు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నగరంగా తీర్చిదిద్దిన బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని పలు బస్తీల్లో మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ముఠా గోపాల్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గానికి బీఆర్‌ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష, నిత్యం జనం మధ్య ఉండే ముఠా గోపాల్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బస్తీల్లో కల్పించిన మౌలిక సదుపాయాలను గమనించి ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని సూచించారు. మోసపూరిత వాగ్దానాలతో మరోమారు ప్రజల ముందుకు వస్తున్న కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ముషీరాబాద్‌లో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి, హరిబాబు యాదవ్, ముఠా జయసింహ, టి.సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన ఎస్.పి.క్రాంతి కుమార్ దంపతులు



చాంద్రాయణగుట్ట,నవంబర్8 : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు స్వర్గీయ పాండురంగారావు కుమారుడు ఎస్.పి.క్రాంతి కుమార్ ఆయన సతీమణి శైలజ బుధవారం ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు పి.భరత్, ఎస్.కరణ్ కుమార్, ఎ.నరసింహాచారి, బి.కోటేశ్, వెంకటేశ్, శ్యాంకుమార్, సాయికుమార్, దశరథ్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

## ఆదరించండి.. అందుబాటులో ఉండి సేవచేస్తా

**బీఆర్‌ఎస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి**



వెస్ట్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు

మలక్‌పేట, నవంబర్ 8 : నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తే.. అందుబాటులో ఉండి సేవచేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, అభివృద్ధి చేసిన పార్టీని గెలిపించాలని కోరారు. బుధవారం మూసారాంబాగ్ డివిజన్ పరిధిలోని వెస్ట్ ప్రశాంత్‌నగర్ కాలనీ, శ్రీశ్రీ బంజారా బస్తీలో ఆయన కాలనీవాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి అజిత్‌రెడ్డి మాట్లాడుతూ... 50 ఏండ్లలో జరుగని అభివృద్ధిని తొమ్మిదేండ్లలో చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అభివృద్ధి చేస్తున్న పార్టీని ఆదరించి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయాలని, అందుకు పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని అనేక హామీలను అమలు చేసిన కేసీఆర్‌కు అండగా నిలవాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా తనను ఆదరించి గెలిపిస్తే అన్నివేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ ప్రశాంత్‌నగర్ కాలనీ, శ్రీశ్రీ బంజారా బస్తీ కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు దేసాయి నాయక్, చందు నాయక్, శివ, ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఆంగోతు అనితా నాయక్, వైస్ చైర్మన్ భూమేశ్వర్, రాధ, మాజీ కార్పొరేటర్లు సామ ప్రభాకర్‌రెడ్డి, తీగల సునరితారెడ్డి, ధర్మరాజు, జగన్, తెల్ల మహేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలి




నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డి తదితరులు

సైదాబాద్, నవంబర్ 8 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. ప్రజలందరూ ఓట్లు వేసే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని యాకుత్‌పుర నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఐఎస్ సదన్ చౌరస్తాలో యాకుత్‌పుర నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల కార్యాయంలో ఆరు మున్సిపల్ డివిజన్ల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్ష, క్యాదర్శులతోపాటు ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారిని కలిసి బీఆర్‌ఎస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరాలని సూచించారు. నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో ఇంటింటి ప్రచారం, గ్రూప్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించాలని, అందుకోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. వివిధ డివిజన్లకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్ రెడ్డి, మైల్‌కోల్ మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశానికి హాజరైన వైశ్యులు

# ఆర్య వైశ్యుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి

**మంత్రి సబితాఇంద్రారెడ్డి**

ఆర్కేపురం, నవంబర్ 8 : ఆర్య వైశ్యుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని మహేశ్వరం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్‌లోని వాసవీ ఆధ్యాత్మిక కేంద్రంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా ఆధ్వర్యంలో ఆర్య వైశ్య ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైశ్యులకు రాజకీయాల్లో కూడా సముచిత స్థానం కల్పించారని తెలిపారు. వైశ్యులందరు ఏకతాటిపై వచ్చి తనకు మద్దతు తెలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆర్యవైశ్యులు అడిగిన విధంగా తుక్కుగూడలో స్థలాన్ని ఇచ్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రూ110 కోట్లతో నియోజకవర్గంలోని నాలాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. తాగునీటి సమస్య లేకుండా చేయడానికి రూ.280 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా పనులు చేపట్టడంతో పాటు నూతన పైపులైన్లు, ట్యాంకుల, రిజర్వాయర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, వాసవీ కాలనీ అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ గుప్తా, టూరిజం అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, అమరవాది లక్ష్మీనారాయణ, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం గుప్తా, మంచుకొండ సురేందర్‌గుప్తా, మెర్రిశెట్టి శ్రీనివాస్‌గుప్తా, జగిని రమేశ్ గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, పద్మరాము తదితరులు పాల్గొన్నారు. కాగా మహేశ్వరం, గొల్లూరు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీల నుంచి 50 మంది మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎలో చేరారు.